ప్రధాన రోడ్లకు మోక్షమెప్పుడో..?

వేంపల్లి ప్రధాన దారులకు మోక్షం ఎప్పుడోనని వేంపల్లె వాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రధాన దారులన్నీ గోతులమయమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ దారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. భారీ గోతులు ఉండడంతో చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పాలకులకు ప్రజల కష్టాలు కనిపించడంలేదు.

- నిలిచిన ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు
- గోతులమయమై దెబ్బతింటున్న వాహనాలు


గుంతలమయంగా మారిన వేంపల్లె రోడ్డు

వేంపల్లె: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేంపల్లెలో ప్రధాన రహదారులను 72 అడుగుల మేర విస్తరించేందుకు శ్రీకారం చుట్టింది. కడప, పులివెందుల, గండి క్షేత్రానికి వెళ్లే 4.2 కిలోమీటర్ల ప్రధాన దారులను రూ 60.05 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల దారిగా విస్తరించి సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. నిర్మాణ పనులు ప్రారంభించి పులివెందుల రోడ్డులో ఒక వైపు సిమెంట్ రోడ్డు నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. ఏడాది కావస్తున్నా పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడం లేదు. కూటమి నేతలు ఆర్భాటాలు చేయడమేగానీ రోడ్డును పట్టించుకున్న పాపాన పోలేదు.

అధ్వాన దారులతో అవస్థ

ప్రధాన రోడ్లపై గుంతలనే పూడ్చలేని కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు ఏమాత్రం నిర్మిస్తుందని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విలాస వంతమైన భవనాలతో ఖరీదైన ప్రాంతంగా జిల్లాలో పేరొందిన వేంపల్లె నివాసితులు అధ్వాన దారులతో అవస్థపడుతున్నారు. కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా రాజీవ్ కాలనీ వరకు, అటు నాలుగు రోడ్ల కూడలి నుండి బైపాస్ వరకు రహదారులు గుంతలతో కనిపిస్తున్నాయి.

కనీస మరమ్మతులకు నోచక..

రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన దారుల నిర్మాణం గిపోవడంతో కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటుచేయక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై ద్విచక్ర వాహనాలలో వస్తూ గుంతలు తప్పించే క్రమంలో అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతూ వేంపల్లె వాసులు నరకయాతన పడుతున్నారు. నిత్యం రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఈ మార్గంలోనే వెళ్తున్నా రోడ్డును బాగుచేయడం లేదు.

దుమ్ము, ధూళితో ఇబ్బందులు



వేంపల్లెలో ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో దుమ్ము, ధూళితో నిత్యం ఇబ్బందిపడుతున్నాం. రోడ్లన్నీ గోతులమయమై చిన్నపాటి వర్షానికే నీటితో నిండుతున్నాయి. వాహనాల రాకపోకలకు ప్రమాదంగా మారాయి. అధికారులు ఒకసారి రోడ్లను పరిశీలించాలి.

– యోగేశ్వర బాబు(వాహనదారుడు), వేంపల్లె


కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రధాన రహదారి పనులు పూర్తిచేయడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పనులు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కొత్త రోడ్లు వేయకపోయినా, గతంలో మంజూరైన ప్రధాన రోడ్లు అయినా వెంటనే పూర్తిచేయాలి. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి.

– అసానయ్య (మండల కో.ఆప్షన్ మెంబర్), వేంపల్లె

వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంత్యుత్సవాలు


ప్రత్యేక అలంకారంలో కన్యకాపరమేశ్వరి

పులివెందుల టౌన్: స్థానిక అమ్మవారిశాలలో సోమవారం నుంచి బుధవారం వరకు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసుశ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన అర్చకులు శంకరయోగి నవీన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అభిషేకం, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు లలిత సహస్ర నామ పారాయణం, కుంకుమార్చన, వాసవీ సహస్ర నామావళి పఠనం జరిగింది. సాయంత్రం అమ్మవారికి సహస్ర దీపాలంకరణ, ఊంజల సేవ నిర్వహించారు. శాశ్వత ఉభయదారుల సౌజన్యంతో అల్పాహారం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి సగళా మహేంద్రబాబు, కోశాధికారి సుబ్రహ్మణ్యం,కాంబోజి గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలని వినతి


తహసీల్దారుకు విన్నవిస్తున్న నాయకులు

పులివెందుల రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎంయూ ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పులివెందుల డిపో ఎస్ఎంయూ చైర్మన్ జేవీ.రమణ, అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డిపో సెక్రటరీ ఆర్.కేశవరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందికి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు నజీర్‌అహ్మద్‌లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో గత నాలుగు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టామని, తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు డిపి.రెడ్డి, ఎస్ఎ.నారాయణ పీవీ.నారాయణ, టీవీఎస్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సర్వే


రహదారిని సర్వే చేస్తున్న అధికారి

పులివెందుల రూరల్: ముద్దనూరు–హిందూపురం రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు మండలలోని వెంకటాపురం, కనంపల్లె గ్రామ సమీపంలో అధికారులు, గుత్తేదారులు సర్వే నిర్వహించారు. విజయవాడ–బెంగళూరు రోడ్డును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించగా అప్పట్లో దాదాపు పనులు సగం మేర పూర్తి చేశారు. మిగిలిన పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా కదిరి, హిందూపురం వరకు రహదారి విస్తరించేందుకు పనులు చేపట్టారు.

దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు): జువారి మైన్స్ బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వలసపల్లె దళిత కాలనీలోని జువారి సిమెంట్ ఫ్యాక్టరీలో మైనింగ్‌తో దళితుల ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేశామని, సిమెంట్ యాజమాన్యం వెంటనే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తొండూరు: మండల కేంద్రమైన తొండూరు ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో తొలి విడత అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానికల్ డీజిల్ ట్రేడ్‌ల కోసం ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ ధ్రువపత్రాలు, అప్లికేషన్‌తో కళాశాలకు వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు తొండూరు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

రైతులకు అవగాహన


మాట్లాడుతున్న శ్రీనివాసులు

సింహాద్రిపురం: మండలంలోని వై.కొత్తపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి శ్రీనివాసులు ప్రకృతి వ్యవసాయ విధానంతో కలిగే ప్రయోజనాలు, లాభాల గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులు రాంప్రసాద్‌రెడ్డి, అమరనాథరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమణ, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

వేంపల్లె: మండల కేంద్రంలో సీఐ నరసింహులు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహులు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దుకాణాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేయాలని కోరారు. పబ్లిక్ స్థలాల్లో మద్యం తాగితే అలాంటి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎస్ఐ తిరుపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

10 నుంచి మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు


మూలవిరాట్


విద్యుద్దీపాల అలంకరణలో మోక్షనారాయణ స్వామి ఆలయం

కమలాపురం: మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన మహాలక్ష్మి సమేత మోక్షనారాయణ స్వామి, వల్లీ దేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు సత్యసాయినాథశర్మ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు శనివారం గణపతి పూజతో ప్రారంభం అవుతాయని, పుణ్య భూమి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరుకు చెందిన వేద ఘనాపాటి వంశీ కృష్ణ ఆధ్వర్యంలో రామనపల్లె వెంకటేశ్వరశర్మ, శివరామశర్మ, మారుతీశర్మ, అన్నపురాజు జగదీష్ శర్మ, శ్రీధర్ శర్మ, కైప నాగేంద్రశర్మ నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఐదు రోజుల పాటు స్వామికి మాడ వీధుల గుండా వాహన సేవలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

14న బండ లాగుడు పోటీలు

మండలంలోని రామాపురంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న న్యూ కేటగిరీ వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుస బహుమతులుగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ సంగీత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఆధార్ శిబిరాల కోసం ఎదురుచూపు

వేంపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలనుకునే వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆధార్ కేంద్రాల వద్దకు వెళ్లిన జనం అక్కడ కాదనడంతో వెనుదిరుగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి విడతల వారీగా సెంటర్లను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో శిబిరాలు ఏర్పాటుచేస్తే చిన్న పిల్లల పేర్లు నమోదు చేసుకొనేందుకు, ఆధార్ కార్డులో తప్పులు సరి చూసుకునేందుకు అవకాశం ఉందని ప్రజలు భావించారు. అయితే స్పెషల్ క్యాంపులను ఏర్పాటు చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కత్తులూరు సచివాలయంలోని ఆధార్ కేంద్రం పనిచేయకపోవడంతో వేంపల్లె గ్రామస్థులు పనులు మానుకొని రోజూ కత్తులూరుకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ ఆధార్ సేవలు సరిగా అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి చాలా గ్రామాల్లో ఉంది. ఇప్పటికైనా ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీఓ కుళాయమ్మను వివరణ కోరగా త్వరలోనే వేంపల్లె మండలంలో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు


మాట్లాడుతున్న వనజకుమారి,

వేంపల్లె: విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వనజకుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి చెప్పారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం కథలు వినిపించారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నామని, పాఠశాలలకు సెలవులు ఉండడంతో విద్యార్థులు చెడు ఆలవాట్లకు దూరంగా ఉండేందుకు ఈ విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ, విదేశాల విషయాలు తెలుసుకొనేందుకు రోజూ విద్యార్థులు పత్రికలు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘటికాచల క్షేత్ర కోశాధికారిగా చంద్రశేఖర్


ప్రమాణ స్వీకారం చేస్తున్న తోటంశెట్టి చంద్రశేఖర్, తదితరులు

వేంపల్లె: తమిళనాడులోని షోలింఘర్ పరిధిలో ఆర్యవైశ్యులు నిర్వహిస్తున్న అఖిల భారత ఘటికాచల క్షేత్ర నిత్యాన్నదాన సమాజం కోశాధికారిగా వేంపల్లెకు చెందిన తోటంశెట్టి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం అఖిల భారత ఘటికాచల క్షేత్ర నిత్యాన్నదాన సమాజం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌తోపాటు నూతన అధ్యక్షుడిగా ప్రొద్దుటూరుకు చెందిన కామిశెట్టి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పసుపుల సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు గౌరవ జీవిత సలహా సభ్యుడిగా వడ్లకుంట వీరయ్య, కార్యదర్శులుగా కాకుమాని సత్య నరసింహులు, తోటంశెట్టి నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా తోటంశెట్టి పెద్దపుల్లయ్య, సభ్యులుగా మేడాప్రసాద్, కర్నాటి నాగేంద్రబాబు, రాయవరం రవీంద్రబాబు, బైరిశెట్టి బాలగంగాధర్, పుల్లగూర అరవింద్, మధుసూదన్ గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు.

రేపు మౌఖిక పరీక్షలు

సింహాద్రిపురం: మండలంలోని సింహాద్రిపురం వెలుగు కార్యాలయంలో మహిళలకు బుధవారం ఆదిత్య బిర్లా సంస్థ ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీఎం మంజునాథ్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 18–35 సంవత్సరాల మధ్య మహిళలు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చునని, వీవోలు ఆయా గ్రామాల్లో మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఎంపికై న మహిళలు ఉద్యోగాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డిమాండ్లను పరిష్కరించాలి


ఆర్డీఓకు విన్నవిస్తున్న నాయకులు

జమ్మలమడుగు: ఆర్టీసీ కార్మికుల 33 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎంయూఏ డిపో కార్యదర్శి శివుడు డిమాండ్ చేశారు. ఆర్డీఓ సాయిశ్రీని సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివుడు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగినులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని, వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేషన్న, నాగేంద్ర, రమణ, సి.శేఖర్, నూర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

వీరపునాయునిపల్లె: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల పూర్తి స్థాయి నివేదికలతో హాజరుకావాలన్నారు.

విశ్వక్సేన ఆరాధన


పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి: లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేయినూతనకోన క్షేత్రంలో సోమవారం విశ్వక్సేన ఆరాధన నిర్వహించారు. మూలమూర్తి బింబ ఆవాహన యాగశాల ప్రవేశం, ధ్వజ కుంభ ఆరాధన మూల మంత్ర హోమం, మంగళ హారతి, చతుర్వేద పారాయణం పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు.

12 నుంచి నిస్సీ ఆశీర్వాద పండగ


పోస్టర్లు విడుదల చేస్తున్న పాస్టర్లు

కమలాపురం: మండల కేంద్రంలో ఈ నెల 12వతేదీ నుంచి నిస్సీ ఆశీర్వాద పండుగ నిర్వహిస్తున్నట్లు పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్ తెలిపారు. స్థానిక నిస్సీ మినిస్ట్రీస్ కార్యాలయంలో బ్రదర్ సునీల్‌దత్‌తో కలిసి ఆయన ఆశీర్వాద పండగ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సీ మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకను పురస్కరించుకుని ఈ నెల 12వతేదీ నుంచి ఐదు రోజుల పాటు ఆశీర్వాద పండుగ జరుపుతున్నట్లు తెలిపారు. రోజూ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాలకు క్రైస్తవ సోదర, సోదరీమణులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పాల్‌కుమార్, రాజేష్, విజయ్, శామ్యూల్, విజయశేఖర్, సురేంద్రపాల్, థామస్, డేవిడ్ రాజ్, రాజ్ కుమార్, సిస్టర్ హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి


ఎంపీడీఓతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

పులివెందుల రూరల్: గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి పదోన్నతిపై పులివెందుల ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్లపైన మురుగు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆశాజ్యోతి కారల్ మార్క్స్


కారల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


పులివెందులలో...

జమ్మలమడుగు: ప్రపంచ కార్మికుల గతి మార్చేసిన ఆశాజ్యోతి కారల్ మార్క్స్ అని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్‌లు అన్నారు. కారల్ మార్క్స్‌ె జయంతి సందర్భంగా స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, కూటమి ప్రభుత్వం కార్మికుల చట్టాలకు వ్యతిరేకంగా పనిచేయడం జరుగుతోందన్నారు. కృష్ణారెడ్డి, నాగన్న, ఓబన్న పాల్గొన్నారు.

పులివెందుల టౌన్: కార్మికుల ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్ అని సీఐటీయూ ఏరియా కార్యదర్శి గఫూర్ అన్నారు. పట్టణంలోని స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూల్‌లో సోమవారం కార్ల్ మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి గఫూర్, సీనియర్ జర్నలిస్ట్ సూర్యనారాయణరెడ్డి, తదితరులు కార్ల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ పరిణామంలో అనేక మతాలు, తత్వాలు ఆవిర్భవించాయన్నారు.

యథేచ్ఛగా అక్రమ మైనింగ్ తవ్వకాలు


విలేకరులతో మాట్లాడుతున్న గాలి హరిప్రసాద్,

వేంపల్లె: వేంపల్లె, చుట్టు పక్కల గ్రామాల్లో అక్రమ ముగ్గురాయి మైనింగ్ నిర్వహిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. వేంపల్లెలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొందరు ముగ్గురాయిని ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వుతున్నారన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ కంటే ఎక్కువగా మైనింగ్ మాఫియా జరుగుతోందని, వేంపల్లె, వేముల మండలాలలో దాదాపు 60 మైనింగ్‌లు నిర్వహిస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారన్నారు. కొంతమంది కూటమి నాయకులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నా.. అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తహసీల్దారు స్పందించి అక్రమ మైనింగ్ అపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుష్మా, ఈశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సునీల్, చంద్ర, ప్రసాద్, చరణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు


జాతీయ రహదారిలో జంక్షన్ వద్ద బ్యారికేడ్లు

కొండాపురం: మండల కేంద్రంలో తాడిపత్రి–ముద్దనూరు జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వరుస జరిగిన రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ప్రమాదాలు జరగకుండా సీఎంఆర్ కాంప్లెక్స్ ఎదురుగా బ్యారికేడ్లు, డ్రమ్స్‌కు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకం


మాట్లాడుతున్న ఏపీఎం గంగరాజు, తదితరులు

లింగాల: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి నిధులు మంజూరు చేస్తున్నామని ఏపీఎం గంగరాజు తెలిపారు. లింగాలలో ఉపాధి హామీ పనులు జరిగే స్థలం వద్ద సోమవారం కూలిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు చీనీ, నిమ్మ, జామ, సపోట, మామిడి తదితర పండ్ల మొక్కలను అందిస్తామన్నారు. మూడేళ్లపాటు కలుపు నివారణ, ఎరువుల వినియోగం, నీటి తడులు అందించేందుకు అవసరమైన నిధులు రైతుల ఖాతాకు నేరుగా జమ చేస్తామన్నారు. మొక్కల నాటేందుకు గోతుల తవ్వకం, మొక్క నాటే పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఏపీఓ ఈశ్వరయ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



పరిమితికి మించి ప్రయాణం చేస్తే ప్రమాదమని తెలిసినా.. ఆటో డ్రైవర్ల చెవికెక్కడం లేదు. వీరపునాయునిపల్లె పోలీస్ స్టేషన్ ఎదురుగానే నిత్యం 30 ఆటోలు వెళ్తుంటాయి. ఒక్కో ఆటోలో 25 నుంచి 30 మందిని తీసుకెళ్తున్నా.. పట్టించుకోవడం లేదు. పెండ్లిమర్రి మండలంలోని పనులకు ఎక్కువమంది తరలిస్తూ ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన అవసరం ఉంది. – **వీరపునాయునిపల్లె**